క్లుప్తంగా

'ప్రజాగర్జన బహిరంగ సభకు తరలిరండి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రెబ్బెన: ప్రజాసమస్యల పరిష్కారం, సింగరేణి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం గోలేటిటౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో ప్రజాగర్జనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉపేందర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, మండల నాయకులు రాజేష్, పూదరి సాయి, బాలు నాయక్, నగేష్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీఎం ప్రతినిధులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు హాస్పిటల్‌లో మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మిల్లు జీఎం గిరి పిలుపునిచ్చారు. బుధవారం యాజమాన్యం ఆధ్వర్యంలో శిబిరాన్ని ప్రారంభించారు. రానున్న రోజుల్లో కూడా స్పర్శ ఫౌండేషన్, మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, మిల్లు అధికారులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజసేవలో యువత పాల్గొనాలి



అంబలి పంపిణీ చేస్తున్న సీఐ, నాయకులు

చింతలమానెపల్లి: యువత సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వారసంతలో మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాలలో యువత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎస్సై విజయ్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు డుబ్బుల వెంకన్న, నాయకులు రాజన్న, మా ఫౌండేషన్ సభ్యులు లోడెల్లి ప్రవీణ్, శేఖర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

జోగు రామన్నను కలిసిన ఎమ్మెల్యే సక్కు



రామన్నతో మాట్లాడుతున్న సక్కు

ఎదులాపురం: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి బుధవారం చేరుకున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రామన్న కంటికి చిన్నపాటి గాయం కాగా కారణాలు అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగవెల్లి పట్నం

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలం ద్వారకాపూర్‌లో బుధవారం బీరప్పా, కామవతిల నాగవెల్లి పట్నం కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తాండూర్ మండల ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాలు అందేదెప్పుడో?

- నిలిచిపోయిన వ్యవసాయ పరికరాల పంపిణీ
- సొంతంగా కొనుగోలు చేయలేక రైతుల అవస్థలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

రెబ్బెన: వ్యవసాయ రంగంలో రోజురోజుకూ యంత్రాల వినియోగం పెరుగుతోంది. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో సమయం, డబ్బు వృథా అవుతుండటంతో రైతులు సాగులో యంత్ర పరికరాలపై ఆసక్తి చూపుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దుక్కి దున్నడం మొదలు పంట చేతికొచ్చే వరకు ప్రతీ పనికి అవసరమైన యంత్రాలు ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. గతంలో రైతులకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించి ప్రోత్సహించింది. అర్హులైన రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ పరికరాలతో ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేశారు. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీ పరికరాల పంపిణీకి స్వస్తి పలికింది. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న ఖర్చులు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం కన్పించడం లేదు. గత ఐదేళ్లుగా ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకానికి నిధులు కేటాయించకపోవటంతో పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. సబ్సిడీ పరికరాలు అందకపోవడంతో సాగు కోసం రైతులు పరికరాలను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒకప్పుడు సాగుకు అవసరమైన ప్లవ్, కల్టివేటర్, వీల్స్, రోటవేటర్, వరినాటు మిషన్లు, స్ప్రే పంపులు, విత్తనాలు వెదజల్లే పరికరాలు వంటి వాటిని సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించేది. దాంతో రైతులు కూలీలపై ఆధారపడకుండా యంత్రాల సాయంతో సాగు చేపట్టేవారు. దీంతో సమయంతో పాటు డబ్బు కూడా ఆదా చేసుకునేవారు. సబ్సిడీ పరికరాలు అందుబాటులో లేకపోవటంతో అద్దెకు పరికరాలను తీసుకుని సాగు చేయాల్సి వస్తోంది. పరికరాలు అద్దెకు లభించని ప్రాంతాల్లో కూలీలపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతో పంటల పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి.

పరికరాల కోసం ప్రదక్షిణలు..

ఆధునిక వ్యవసాయంలో యంత్ర పరికరాలు కీలకంగా మారినప్పటికీ సబ్సిడీ పరికరాల పంపిణీకి మోక్షం కలగడం లేదు. సబ్సిడీ పరికరాల పంపిణీ లేకపోవటంతో వ్యవసాయానికి కావాల్సిన పరికరాలను సొంతంగా కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని రైతులు అద్దె పరికరాలపై ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెరుగుదల అద్దె పరికరాలపై ప్రభావం చూపుతుండటంతో పంటల సాగు వ్యయం పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రతీ సంవత్సరం పంటల సీజన్ ప్రారంభానికి ముందు రైతులు సబ్సిడీ పరికరాల పంపిణీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నా గత ఐదేళ్లుగా రైతులకు నిరాశే మిగులుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు సైతం సబ్సిడీ పరికరాల పంపిణీపై స్పష్టత ఇవ్వకపోవటంతో రైతులు పరికరాల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వం మంజూరు చేయడం లేదు

సబ్సిడీ వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. 2018 నుంచి ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ పరికరాల పంపిణీ నిలిపివేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే మండలంలోని రైతులకు సమాచారం అందించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. – మంజుల, మండల వ్యవసాయాధికారి

'అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం'

బెజ్జూర్: అధైర్య పడొద్దని కష్టకాలంలో అండగా ఉంటామని బాధిత కుటుంబానికి జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సూర్ల శంకర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి దహన సంస్కాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ పుష్పలత, మండల కోఆప్షన్ సభ్యులు బషరత్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, మాజీ చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, ఎంపీటీసీ శ్రీను, నాయకులు రామకృష్ణ, రాజేష్, షౌకత్అలీ, గొర్రె శంకర్, దేవాజీ, సతీష్, జాహిద్ హుస్సేన్, వినోద్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కృష్ణారావు

సూర్ల శంకర్‌కు అర్షద్ హుస్సేన్ నివాళి

బెజ్జూర్: బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సూర్ల శంకర్ అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం ఆయన అంత్యక్రియల్లో బీఎస్పీ సిర్పూర్ నియోజకవర ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ పాల్గొన్నారు. ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాడె మోశారు.

బీమా చెక్కు అందజేత

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. గురువారం మోతుగూడ గ్రామానికి చెందిన రైతు నారాయణ మృతి చెందగా ఆయన భార్యకు రూ.2 లక్షల బీమా చెక్కును బ్యాంకులో అందజేశారు. రైతులు ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం ద్వారా సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే ఎలాంటి మరణం పొందినా కుటుంబసభ్యులకు రూ.2లక్షలు బీమా వస్తుందన్నారు.



చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ విశ్వనాథ్

ప్రజలు బీమాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

బెల్లంపల్లి(తాండూర్): వరిధాన్యం కొనుగోలు చేయడానికి రైతులను ఏలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండలం కాసిపేటలో బుధవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తూకం వేసి పది రోజులు గడుస్తున్నా, ధాన్యం రవాణా చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు గోడు వెళ్ల బోసుకున్నారు. రైతుల బాధను కలెక్టర్ బదావత్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

దహెగాం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు, రేపు దహెగాం పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్ రూరల్ పరిధిలోని కాగజ్‌నగర్, ఈస్గాం, పెంచికల్‌పేట్, దహెగాం, పరిధిలోని గ్రామాలకు చెందిన క్రీడాకారులకు దహెగాం పోలీస్‌స్టేషన్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ జట్ల పేర్లను గురువారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 5వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఉన్నందున సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. గురువారం మండలంలోని శాకన్‌గొంది గిరిజన గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ యూనిట్ శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు తమ గ్రామంలోకి వచ్చినప్పుడు మొబైల్ మెడికల్ యూనిట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, సర్పంచ్ పార్వతి, తిరుపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రైవేట్'తో ప్రమాదం..!



పెళ్లికి వెళ్తుండగా చింతలమానెపల్లిలో బోల్తా పడిన బొలెరో వాహనం (ఫైల్)

- శుభకార్యాలకు లారీలు, వ్యానుల్లో ప్రయాణం
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆర్టీసీ సేవలపై అవగాహన కరువు

కౌటాల: వివిధ శుభకార్యాలకు వెళ్లేందుకు జిల్లా ప్రజలు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఆయా వాహనాల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తుండడంతో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. శుభకార్యాలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినా ప్రజలు ఆర్టీసీ సేవలు వినియోగించుకోవడం లేదు. ఆర్టీసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడం వల్లే ప్రజలు ఆర్టీసీ బస్సులను కాదని ప్రైవేట్ వాహనాలకు మొగ్గు చూపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

నిబంధనలకు విరుద్ధంగా శుభకార్యాలకు వెళ్లే వారు ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్నారు. చాలామంది మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు కావడంతో తక్కువ ధరకు వచ్చే వ్యాను, బొలెరో, లారీలను ఆశ్రయిస్తున్నారు. పరిమితికి మించి వీటిలో వెళ్తుండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది వేసవిలో చింతలమానెపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన 15 మంది బొలెరో వాహనంలో పెళ్లికి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో 9 మందికి గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు ఏటా జిల్లాలో జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి లారీ, వ్యానుల్లో ప్రయాణాలు చేస్తుంటే రవాణా అధికారులు తనిఖీలు చేసి వాహనాల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాని తనిఖీలు జరగడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు.



వ్యానులో ప్రమాదకరంగా వెళ్తున్న ప్రజలు (ఫైల్)

ఖర్చు తక్కువని..

వివాహాలకు ప్రజలు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఖర్చు తక్కువగా అవుతుందని లారీలు, వ్యాన్, ట్రాక్టర్, ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో కొన్నిసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– డి. విజయ్, గుండాయిపేట

యజమానులపై చర్యలు తీసుకోవాలి

నిబంధనలకు విరుద్ధంగా వందల కొద్ది మందిని ప్రైవేట్ వాహనాల్లో ఎక్కిస్తున్న వాహనాల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. వాహన యజమానులపై భారీగా జరిమానాలు విధించాలి.

– శంకర్, ముత్తంపేట్

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాలి

- పంచాయతీ అధికారుల పనితీరుపై ఆగ్రహం
- మొక్కుబడిగా ఆసిఫాబాద్ గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, బజార్‌వాడీ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని స్థానికులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి డీపీవో సురేందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరవడంతో సభ మొక్కుబడిగా సాగింది. గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారులు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై ప్రజలు సభలో ఏకరువు పెట్టారు. పైకాజీనగర్‌లో రెండేళ్లుగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పలువురు తెలపగా నిధుల కొరత వల్ల పనులు నిలిచిపోయాయని, వర్షాకాలంలోగా డ్రెయినేజీపై స్లాబు వేస్తామని పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున హడ్కో కాలనీ, బజార్‌వాడీలో డ్రెయినేజీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పలువురు మైనార్టీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రాజంపేట, గుండిరోడ్డుపై విద్యుత్ ఓల్టేజి తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బజార్‌వాడీ అంగన్‌వాడీ కేంద్రం –1లో కొత్తగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కాలనీవాసులు కోరారు. బజార్‌వాడీలోని మసీదు వద్ద కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వైర్లు ఏర్పాటు చేయలేదని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రి ముందు చిన్న వర్షం కురిసినా చెరువును తలపిస్తుందని, మిషన్ భగీరథ నీరు పట్టణంలో ఎక్కడా సరఫరా కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల గైర్హాజరుతో సమస్యలు చెప్పుకోలేక పోతున్నామని, గత సమావేశంలో కూడా అధికారులు గైర్హాజరయ్యారని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనంతరం గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్‌బాజ్‌పాయ్‌కు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి డీపీవో సురేందర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, బిల్‌కలెక్టర్ సంతోశ్, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు గైర్హాజరైన వివిధ శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కి ఫిర్యాదు చేశారు. నాయకులు సయ్యద్ నిసార్, ఉబెదిబిన్ యాహియా, అహ్మద్, షబ్బీర్, షాహీద్, తదితరులు ఉన్నారు.



చాహత్ బాజ్‌పాయ్‌కి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

క్రీడాకారులకు అండగా ఉంటాం

చింతలమానెపల్లి: మండలంలోని క్రీడాకారులకు అండగా ఉంటామని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో చింతలమానెపల్లి వాలీబాల్ జట్టుకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయిలో చింతలమానెపల్లి వాలీబాల్ జట్టు రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఈనెల 27 నుంచి జూన్ 1వరకు రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఆసిఫ్ అలీ, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ నానయ్య

రోడ్డు లేక ఇబ్బందులు



రాళ్లురప్పలు తేలి నడిచేందుకు యోగ్యంగా లేని లేండిగూడ రోడ్డు

- సరిహద్దు వరకు రోడ్డు వేసిన 'మహా' ప్రభుత్వం
- మిగిలిన రోడ్డు నిర్మించని తెలంగాణ అధికారులు



మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన తారురోడ్డు

కెరమెరి: మండలంలోని తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న లేండిగూడ, గౌరి గ్రామాల ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో 220 కుటుంబాలు ఉండగా సుమారు 800 వరకు జనాభా ఉంది. కేవలం రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపడితే సమస్య పరిష్కారం అవుతుంది. కాని తెలంగాణ రాష్ట్ర అధికారులు పట్టించుకోవడం లేదు.

రోడ్డు వేసిన మహారాష్ట్ర ప్రభుత్వం..

మహారాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని చిక్లి గ్రామం నుంచి లేండిగూడ గ్రామ సమీపంలో సరిహద్దు వరకు బీటీ రోడ్డు నిర్మించారు. మరో 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం తెలంగాణ ప్రభుత్వం చేపట్టాల్సి ఉంటుంది. కాని మిగిలిన రోడ్డు నిర్మాణానికి తెలంగాన ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో గుంతలు, బండరాళ్లు, కంకర తేలి నడిచేందుకు కూడా రోడ్డు యోగ్యంగా లేదు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం చిక్లి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గౌరీ వరకు తారురోడ్డు నిర్మించింది. కాని తెలంగాణ ప్రభుత్వ అధికారులు మాత్రం రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు.

ఇమిడి ఉన్న అనుబంధాలు..

మండలంలోని అనేక గ్రామాలు మహారాష్ట్ర సంస్కృతి కలిగి ఉన్నాయి. ఇప్పటికీ అనేక కుటుంబాలు అక్కడి పండుగలు, ఆచార వ్యవహారాలు కొనసాగిస్తున్నాయి. మహారాష్ట్ర వారితో స్థానికులకు బంధుత్వాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతీరోజు బైక్‌లు, జీపులు, కార్లు, ఆటోలు తరుచుగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో రెండు రాష్ట్రాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



మహారాష్ట్ర ప్రభుత్వం సగం వరకే రోడ్డు నిర్మించింది. మిగిలిన రెండు కిలో మీటర్ల రోడ్డు అలాగే ఉంది. దీంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి.

– పర్మటే దశరథ్, లేండిగూడ

ఓఆర్ఎస్ అందజేత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు.